

శ్రీవారి ప్రధాన అర్చకులు
ఏ.వి.రమణ దీక్షితులు

# వేంకటేశ్వరస్వామివారు సాక్షాత్తూ విష్ణుమూర్తే!!!

**వం**శపారం పర్య అర్చకునిగా శ్రీవారికి సేవలిందిస్తూన్న ఆయన పేరు ఏ.వి. రమణదీక్షితులు. తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామిలానే ఆయనఎత్తతి. స్వామివారు నలుపయితే ఈయన తెలుపు. స్వామివారి వేదవిదుడు ఈ అర్చకస్వామివారు వైద్యశాస్త్ర విదుడు. ఊపిరితిత్తుల్లోని వ్యాధులూ మార్పులను యాంటీ ఎలర్జీ మందుల్ను వాడకుండా సరిచేయవచ్చుననే విషయంపై కొన్ని పరిశోధనా వ్యాసాలను ఆంగ్లంలో వ్రాసారు. మెదడుపై వాడే ఎలెర్జిటిక్ మందుల ద్వారా యేర్పడే పరిణామాలు ఏయే విధంగా మార్పునొందుతాయనే విషయాల మీద కూడా పరిశోధనల్ను చేసారు. ఇవి సాదాసీదాగా చేసిన పరిశోధనలు కావు. పెద్ద పెద్ద మెడికల్ సైంటిస్టుల్లా సశాస్త్రీయ పరిశోధనల్ని చేసారు. ఇవన్నీ అమెరికన్ ఎలెర్జీ అసోసియేషన్ పత్రాల్లో ప్రచురించబడ్డాయి. బహుముఖంగా వైద్య పరిశోధనా కర్తలచే ప్రశసింపబడ్డాయ్.

తెలుగువారు స్వతఃసిద్ధంగా టీకా మందులను కనిపెట్టారు. కొన్ని దశాబ్దాల క్రితం హిమాలయాల్లో ప్రవహించే జలప్రవాహంలో కొట్టుకుని పోయిన ఇద్దరు క్షయవ్యాధిగ్రస్థులు– మూలికా మూలకంగా ప్రవహించిన నీరును త్రాగి, భయంకరమైన క్షయవ్యాధిని పొగొట్టుకున్నట్లు ఓ హిందీ చిత్రంలో (పేరు తెలియదు) బాగా చిన్నతనంలో చూసాను. అటు తరువాత మన తెలుగువాడు సుబ్బారావుగారొక గొప్ప వాక్సిన్ కనుగొని, అమెరికన్లు అందరిచేత ప్రశంసింపబడ్డారు. ఇటీవలే హైదరాబాద్‌లోని డా॥ ఐ వరప్రసాద్ రెడ్డి గారొక వాక్సిన్ కనుగొని మన హిందూ ద్రవ్యంతో హెచ్చుధరలకు కొనుక్కునే పద్ధతికి అడ్డుకట్ట వేసారు. శాంతా బయోటెక్సు పేరుగల ఆ ఔషధం చాలా మందికి తక్కువ ధరకే అందుబాటులోకి వచ్చింది.

అర్చకుల కుటుంబంలో పుట్టిన రమణ దీక్షితులు పెద్ద సైన్సు గ్రాడ్యుయేట్ అయ్యుండీ, పరిశోధకుడయ్యుండీ– వంశపారంపర్యంగా లభించు తిరుమల శ్రీవేంకట రమణుని ప్రధాన అర్చకత్వాన్నే నిర్ణయించుకొని– తిరుమల వేంకట రమణుని సేవ చేస్తున్నారు. లేనిచో మిలియన్ల రూపాయలను సంపాదించే వైద్య పరిశోధకుడయ్యేవారేమో!

విత్తము ప్రధానము కాదు చిత్తమును రంజింపచేయు విత్తనము భగవచ్చింతనమే సుమా – అనెడి సూనృత వాక్యమునకు ప్రాధాన్యమిచ్చి శ్రీరమణ దీక్షితులుగా శ్రీవారి కొలువు చూస్తున్నారు.

వేంకటరమణ దీక్షితుల వైద్య శాస్త్ర ప్రమాణానికి సరితూగు పరిశోధనల్ను చదివి, అందు క్రోడీకరించిన విశేషాలను అధ్యయనం చేసిన వైద్య విశ్వ విద్యాలయములూ, విజ్ఞానులూ, ఆహ్వానించినప్పటికినీ వెళ్లలేదు. విశ్వంలోని విశ్వవిద్యాలయము లన్నింటికన్నా వేంకటేశ్వరుని సన్నిధిలో సేవచేయడమే పెన్నిది అనుకున్నారు. ఆయన సమక్షంలోనే వేదాలున్నాయ్. వేదాలను పరిరక్షించినది ఆయనే! ఆయనే వేదోద్ధారకుడు. ఆయనే వేదాంత వేద్యుడు యని సుప్రభాతంలో కొలిచారు. వేదశాస్త్రానికి విజ్ఞానం ఏ తత్సర్వం జనార్దనాత్ అన్న ప్రయోగం కన్నా ఔచిత్యంగా చెప్పకలిగింది లేదేమో! సైన్సుతో ముడివడే వైద్యశాస్త్రం ఉన్నది. నారాయణుడూ వైద్యుడు. భౌతిక, మానసిక, శారీరక రుగ్మతల్ని నివారించు వాడాయనే!

అందువలనేమో వెంకట రమణ దీక్షితులు అన్ని ఆహ్వానాలు తిరస్కరించాడు. స్వామి సేవకన్నా మించిన దేఃవి ఉంటుంది. వైద్య విశ్వవిద్యాలయాల ఆహ్వానం ప్రకారం విదేశీయానంలో ఒక్కసారిసాగరం దాటినా ఆయనకు వేంకటేశ్వరస్వామి వారి ప్రధాన అర్చకత్వానికి అనర్హుడౌతాడు. అందుకే అన్ని ఆహ్వానాలను సున్నితంగా తిరస్కరించాడు. పైగా స్వామివారి ప్రధాన అర్చకులు గొల్లపల్లి వెంకటపతి దీక్షితులకు ఒక్కడే కుమారుడు. తాను ప్రధానార్చక సేవలో చేరకపోతే వంశపారం పర్య అర్చకసేవ పోతుంది. అలాటి అతి పవిత్ర సేవ తన కుటుంబీకులకు దక్కదు.

దేవుని సేవా? విశ్వవైద్య శాస్త్రజ్ఞునిగా చెలువొందడం కోసం, విదేశాలకు వెళ్లడమా? వేంకటేశ్వరస్వామి వారి అర్చకుల కుటుంబంలో పుట్టిన అదృష్టాన్ని కొనసాగించడానికే నిర్ణయించుకున్నారు.

ఆయన కళ్లల్లో తేజం ఉంది. ఫాలం పాల సముద్రోద్భవుడిగా ఉంటుంది. నా చిన్నతనంలో మా పాలకొల్లు ప్రక్కన ఉన్న నరసాపురంలో దీక్షితులనే గొప్ప హరికథ రచయిత కర్తలూ అయిన పెద్దింటి దీక్షితులు గారుండేవారు. ఆయనచెవులకు కమలాలుండేవి. ఆ కమల కుండలాలు, నామం గల ఆయన శ్రీమన్నారాయణుని లాగనే ఉండేవారు. అలాటి మోముగలవారే ఈ వేంకటరమణ దీక్షితులు. ఈయన్ను తిరుమలలో చూచి ఆయనే ఈయన అనుకున్నాను. వేంకటరమణదీక్షితుల కళల్లో ఏదో వింతయిన కళ కనిపించింది. అందుకే వేంకటేశ్వరుడీయన్ను తిరుమల నుంచీ కదలనీయలేదేమో!

**ఆ**రోజుల్లో తిరుమల క్షేత్రం, శ్రీ వేంకటేశ్వరస్వామి దర్శనం గూర్చి ప్రధాన అర్చకులు వేంకటరమణ దీక్షితులు గారి వాస్తవాలకు నా అనుభూతుల్ని కూడా జోడించి క్రోడీకరిస్తున్నాను!

ఆనాటి దర్శన విశిష్టతలోని ప్రశాంతతే వేఱు. రెండు మూడు – లేదా నాలుగు బస్సుల్లో వెళ్ళిన వారి అనుభూతులు వేఱు. బస్సు దిగి తిరుమలలో ప్రవేశించే వారికి ముందొక రావిచెట్టు కనిపించేది. దానికి వామభాగమున కళ్యాణకట్ట, వేడినీళ్ళు తెచ్చి యిచ్చే సౌకర్యమూ ఉండేది. అక్కణ్ణించి వెడుతూంటే ఇరుప్రక్కల స్థానికుల కొట్లు, కన్నెర్రగా కనిపించేవి. ఆపైన ఓ వంద అడుగులు వేస్తే దేవస్థానం వారి ఫలహారశాల, ఆలయ అభిముఖంలో స్వామి వారి ఫోటోలు, కొబ్బరికాయలు. పూజా సామాన్లు విక్రయించేవారు. గొల్ల మండపం వద్ద కొబ్బరికాయ కొట్టి హారతి యిచ్చి, ఒక చిప్పను హుండీలో వేయడం జరిగేది.

వేంకటరమణ దీక్షితులు గారు – అంతరాలయంలో అప్పటి భక్తుల దర్శన వివరాల్చూస్తే వెండి వాకిలి వరకూ భక్తుల క్యూ వచ్చిందంటే ఎక్కువ గుంపుగా భక్తులు వచ్చారనేడి లెఖ్ఖట. ఉదయం 6 గంటలకు సుప్రభాతం, రాత్రి 9.00 గంటలకు ఏకాంత సేవ – అన్నీ స్థిమితంగా, దివ్యశక్తితో, ప్రశాంతంగా జరిగేవి. స్వామివారి ముఖబింబంలోని దివ్యశక్తి ప్రసన్నంగా కనిపించడం, భక్తుల మొక్కులను స్వామివారు గ్రహించినట్లూ, అనుగ్రహించినట్టూ ఓ తృప్తి **(తరువాయి 17వ పేజీలో)**


# సీతారామయ్యకు వారి నాదస్వరమే మేల్కొలుపు

## భద్రాచల సీతారామచంద్రస్వామి సేవలో తరిస్తున్న ముస్లింసోదరులు

*నిత్యం భద్రాది రామయ్యను వీరి నాదస్వరం మేలుకొల్పుతుంది. వీరి తియ్యని 'నాద' స్వరంలో రామాలయ ప్రాంగణం పరవశించిపోతుంది. మతసామరస్యానికి ప్రతీకగా నిలుస్తున్న ఈ ముస్లింలు.. కౌసల్యా సుప్రజా రామ.. అని వేకువజామున వినిపించే సుప్రభాత సేవ నుండి రాత్రి నిర్వహించే పవళింపు సేవల్చేస్తూ వీరు రామయ్య సన్నిధినే గడుపుతారు.*

భద్రాచలంలోని శ్రీసీతారామచంద్రస్వామి దేవస్థానంలో దశాబ్దాల కాలంగా ఇరువురు ముస్లింలు మంగళవాయిద్యాల బృందంలో నాదస్వరం (సన్నాయి) తాళం వాయించే కళాకారులు. నల్గొండ జిల్లా మటంపల్లి మండలం రఘునాధపాలెం గ్రామానికి చెందిన షేక్ మౌలాసాహెబ్ 2000 సంవత్సరం నుంచి భద్రాద్రి రామాయలంలో నాదస్వర కళాకారుడిగా విధులు నిర్వహిస్తున్నాడు. ఈయన తాతగారైన పల్నాడు నాదస్వర విద్వాంసులు హుస్సేన్ వద్ద నాదస్వర వాయిద్యం నేర్చుకున్నాడు. ప్రతిఏటా రామాలయంలో జరిగే ముక్కోటి ఉత్సవాలకు మౌలా సాహెబ్‌ను పిలిపించేవారు. ఈ క్రమంలో 2000 సంవత్సరం నుంచి దేవస్థానం ఆస్థాన నాదస్వర కళాకారుడిగా విధులు నిర్వహిస్తున్నారు. ఇతని పెద్ద కుమారుడు బాషా భద్రాద్రి ఆలయంలోనే పనిచేస్తున్నాడు. రెండవ కుమారుడు హుస్సేన్ ఆర్ఎంపి వైద్యుడిగా పనిచేస్తున్నాడు. హిందూ సాంప్ర దాయం ప్రకారం ఉదయం దీపారాధన చేసి రామయ్య సేవకు ఉపక్రమించడం మౌలాసాహెబ్‌కు నిత్యకత్య మైంది. దేవస్థానంలో జరిగే అన్ని పూజా కార్యక్రమాల్లోనూ పాల్గొంటాడు. అయితే రంజాన్, బక్రీద్ పండుగల సమయంలో మసీద్‌లకు వెళ్లి నమాజ్ చేస్తాడు. రామయ్య దయవల్లే తన కుటుంబం సంతోషంగా ఉందని, జీవితాంతం రాములోరి సేవలోనే తరిస్తానని ఆనందంగా చెపుతుంటాడు.

కృష్ణాజిల్లా తిరువూరు మండలం గోసవీడుకు చెందిన షేక్ కాశిం బాబు కూడా సంగీత విద్వాంసుల కుటుంబానికి చెందిన వాడే. ఈయన తండ్రి హుసేన్ సాహెబ్ 1953 నుంచి భద్రాద్రి సీతారామ చంద్రస్వామి దేవస్థానంలో జరిగే ఉత్సవాలలో నాదస్వర విద్యాంసులుగా సేవలందించారు. అయితే తన చిన్నప్పుడే సంగీతం నేర్చుకున్న కాశింబాబు కూడా ఉత్సవాల సమయంలో రామయ్య సేవలో తరించే వాడు. 2000 సంవత్సరం నుంచి ఇక్కడే మంగళ వాయిద్యబృందంలో పనిచేస్తున్నాడు. ఈయన నాదస్వరంతోపాటు తాళం వాయించటంలోనూ దిట్ట. కుల, మత బేధం లేదని, మనస్సు స్వచ్ఛంగా ఉంటే ఏ దేవుడైనా చల్లగా చూస్తాడని, తాము రామయ్య సన్నిధిలోహాయిగా బతుకుతున్నామని చెపుతున్నారు.


నాదస్వరం ఊదుతున్న మౌలాసాహెబ్
తాళం వాయిస్తున్న కాశింబాబు

**(16వ పేజీ తరువాయి)** – ఇప్పుడంతా హడావుడి. వేగం, వేగిరం తోపులలాటలూ, స్వామివారు సరిగా కనిపించ లేదనెడు బాధ, లఘు దర్శనం, మహా లఘు దర్శనం, 12 గంటలు, 24 గంటలు, 36 గంటలు నిరీక్షణం. చాలావరకూ నాకూ, నా మిత్రులకూ అనుభవంలోకి వచ్చినవి.

అలా దీక్షితుల్ని మూడున్నర దశాబ్దాలుగా తిరుమలేశ్వరుడు తన సేవలో కట్టివేసారు. ఆయన కుటుంబం ఉత్తరమాడా వీధిలోని మట్టి మిద్దె ఉండేది 365 రోజులూ చలి ఉండేదనీ, వాన వంగిడి వచ్చినపుడు, చక్కటి మన్ను వాసన వచ్చేదనీ చెబుతూ, బ్రహోత్మవాలు వచ్చినప్పుడు మహా మహా సందడిగా ఉండేదని చెప్పారు. వీధిలో ఉండేవారు తమ యింటి ముందు మామిడి తోరణాలు, అరిటిబోదలు కట్టుకునుకేవారమని చెప్పడంతో నా మనసెంతగానో పొంగిపోయింది. క్షేత్రమెంతటి పురాతన ఉనికిని కల్గిందీ తెలుస్తుంది. గుడిచుట్టూ జామ మొక్కలుండేవని రెండు హోటళ్లు ఉండేవని ఓ పత్రికకిచ్చిన గోష్టిలో చెప్పారు.


నేనెరిగినంత వరకూ శ్రీవారి గుడిని చుట్టి నాలుగు మాడావీధులుండేవి. ఒక వీధిలో శ్రీరామ మందిరం ఉండేది. మరో వీధిలో ఆలయ అర్చకులూ, ఇతర ఉద్యోగులూ, శృంగేరీ మఠమూ, సగం శిథిలమయిన రెండు మఠములూ ఉండేవి. వెనుకవీధిలో దక్షిణ భారత ఆర్యవైశ్యుల సత్రమూ, దాని కెదురుగా కర్ణాటక సత్రమూ ఇలా ఇలా కొన్ని గ్రామవాసనలు విరబూచేయిళ్ళూ ఉండేవి. ఇవన్నీ ఈ వ్యాసానికి అప్రస్తుతములు. కాబట్టి దీక్షితులుగారు చెప్పిన తిరుమల క్షేత్ర పూర్వ విశేషాలను తెలుసుకుందాం!

ఆలయ కైంకర్యం చేసే పెద్దింటి, పైడిపల్లి, గొల్లపల్లీ మరో తిరుపతి అమ్మగారి కుటుంబం – ఇలా నాలుగు కుటుంబాలుండేవి. దీక్షితులు గారింటిపేరు గొల్లపల్లి వారు. వీరు గొల్లపల్లి వెంకటపతి దీక్షితులు సౌభాగ్యమ్మ దంపతుల ఏకైక సంతానం.

వేంకటేశ్వరస్వామివారు శ్రీమహావిష్ణువాంశులే. మూలవర్లులో శంఖుచక్రాలు ముక్కోటి దేవతలూ, ఇతర దేవతగణాలూ సర్వకాలమూ దర్శిస్తారన్నది వాస్తవం. మహా విష్ణువు ఆరాధనాచారంలోనే వైఖానస ఆగమ ఆరాధనం జరుగుతూంది. అన్ని అర్చనలూ అలానే జరుగుతూ ఉన్నాయ్. నిర్గుణమైన రూపం. నిరుపమానమైన అందం. అర్చనలు, హారతులు నివేదనలన్నిటి విషయంలోనూ శ్రీవారి ప్రత్యేకత శ్రీవారిదే.

ఆయన పరమాత్మ. పరంధాముడు. పురుషలింగంగానో, స్త్రీలింగంగానో అనుకోవడం సరికాదు. ఆయన స్వయంభువుడు. వారి పరివార దేవతలు, విమాన దేవతలు, ద్వారపాలకులు దేహరహితులు. శక్తి స్వరూపులు. మనం స్వామివారి ఒక్కొక్క ద్వారాన్ని దాటి వెళ్ళేటప్పుడు ఆయా ద్వార శక్తి ప్రభావం మనమీద పడుతుంది. అనిర్వచనీయమైన అనుభూతి కలుగుతుంది. గోవిందా గోవింగా అనే స్మరణం తక్క మనం ఏఁవి కావాలని కోరుకుని వచ్చామో అవి ఆ ద్వార ప్రభావంతో మరచిపోతాం. అదో విధమైన తన్మయత్వం కలుగుతుంది. బంగారు వాకిలి వచ్చి చేరుసరికి తాదాత్మస్థితిలోకి వెళ్లిపోతాం. ఆ స్వామి స్వరూపాన్ని చూస్తూ స్వామీ స్వామీ గోవిందా గోవిందా అంటూ గోవింద నామస్మరణతో తాదాత్మ్యం చెందిపోతాం. అలా స్వామిసేవలోనే నన్ను తరింపచేస్తున్నారు. నా ముగ్గురు పిల్లలూ స్వామి సేవలోనే ఉన్నారు. **అన్యధా శరణం నాస్తి త్వమేవ శరణం మమ** అన్నట్లు వారి ప్రతికా గోష్టి జరిగి ఓ రెండు సంవత్సరాలయి ఉంటుంది. జ్ఞాపకమున్నంత వరకూ వ్రాసాను. ●






# ఆనాటి తిరుమల చిన్న గ్రామం! నేడు దివ్య మహానగరం!

**నూ**రు నూటయాభైయేళ్ల క్రితం... కొండపైన శ్రీవారి ఆలయం, హథీరాంజీ మఠం తప్ప వేరే ఏ నిర్మాణాలు ఉండేవి కావు. అర్చకులు సైతం కొండ కింద ఉన్న కొత్తూరులోనే ఉండేవారు. తెల్లవారురూమునే లేచి సప్తగిరులూ ఎక్కి ఉదయం ఏడుగంటలకు వెళ్ళి స్వామికి మేలుకొలుపులు పాడేవారు. అడవిలోని జంతువులు, దొంగల భయంతో యాత్రికులు గుంపులు గుంపులుగా, డప్పులు వాయిస్తూ, గోవింద నామ స్మరణ చేస్తూ కొండ ఎక్కేవారు. రాళ్లూ రప్పలు నిండిన దారిలో కొంతసేపు వెళుతూ, మధ్యలో వంటావార్పు కోసం ఆగుతూ... మొత్తానికి పైకి చేరుకునేసరికి దాదాపు రెండు రోజులు పట్టేది. వారు మధ్యలో ఆగేందుకు మూడుచోట్ల దిగుడు బావులు, విశ్రాంతి మండపాలూ ఉండేవి. వాటిని ఠాణాలు అనేవారు. వయసు మళ్లినవారినీ, అంగవికలురలనూ పిల్లలనూ పైకి తీసుకువెళ్లేందుకు డోలీ కూలీలు ఉండేవారు. కావడి బద్దకు కుర్చీలు అమర్చి నడవలేనివారిని వాటిమీద కూచోబెట్టుకుని పైకి మోసుకెళ్లేవారు. అందుకు పది అణాలు రుసుము వసూలు చేసేవారు. సామాన్యులకు ఆ మాత్రం స్థోమత కూడా ఉండేది కాదు. తిరుమల రావిచెట్టు (ఇప్పుడు కళ్యాణకట్ట ఉన్న ప్రదేశం) దగ్గర డోలీలు నిలుపుకోవడానికి ఒక ప్రత్యేక మండపం ఉండేది. అక్కడి దాకానే ఈ డోలీలను అనుమతించేవారు. ఆ స్టాండును డోలీమండపం అనేవారు. (ఇప్పుడు కూడా డి.ఎం.బి. రోడ్డుగా వ్యవహరిస్తున్నారు.). అక్కణ్నుంచీ సన్నిధి వీధి మీదుగా గుడికి చేరుకుని, మహాద్వారం గుండా లోపలికి ప్రవేశించిన భక్తులు స్వామి దర్శనం చేసుకునేవారు. 1870లో యాత్రికుల సౌకర్యార్థం ప్రభుత్వం కొండమీదకు మెట్లు నిర్మించింది. 1933లో ఏర్పడిన తితిదే బోర్డు రూ. 26 వేల ఖర్చుతో ఆ మెట్ల మార్గాన్ని అభివృద్ధి చేసింది.

### ఘాట్‌రోడ్డు నిర్మాణం

1940ల నాటికి తిరుమలకు వచ్చే భక్తుల సంఖ్య మెల్లగా పెరగడం మొదలైంది. అప్పటి ఉమ్మడి మద్రాసు ప్రభుత్వం కొండమీద రోడ్డు మార్గం గురించి ఆలోచించింది. బ్రిటిష్ అధికారులు, సర్వే బృందాలవారు, తిరుపతి చేరుకున్నారు. జనంలో ఆశ్చర్యం.అసలు అంత ఎత్తు కొండలకు రోడ్డెలా వేస్తారా అని! వారి అనుమానాలన్నీ పటాపంచలు చేస్తూ 1944 ఏప్రిల్ నాటికి అలిపిరి నుంచి తిరుమల దాకా ఘాట్ రోడ్డు నిర్మాణం పూర్తయింది. అదేనెల పదోతేదీన మద్రాసు రాష్ట్ర గవర్నర్ ఆర్థర్‌హోప్ రోడ్డు మార్గాన్ని ప్రారంభించారు. నెమ్మదిగా దేవస్థానమే తిరుమల– తిరుపతి మధ్య రెండు బస్సులు ప్రారంభించింది. అవి తిరుపతిలోని మొదటి సత్రం నుంచి రోజుకు మూడుసార్లు ఉండేవి. తిరుమల నుంచి రాత్రి ఏడుదాటితే బస్సులే ఉండేవి కావు. 1955–56లో రైల్వేస్టేషన్ సమీపాన శ్రీనివాస బస్టాండు ఏర్పడే నాటికి భక్తుల సంఖ్య రోజుకు 500 నుంచి 600 వరకు ఉండేవి. బస్సుల సంఖ్య పెంచుకుంటూ పోవడంతో సౌకర్యంగా ఉండి భక్తులు వెల్లువెత్తసాగారు. దీంతో రెండోఘాట్ రోడ్డు గురించి ఆలోచించాల్సి వచ్చింది. 1974 నాటికి అదీ పూర్తయింది.




### కొండమీద ఊరు

తిరుమల నిర్వహణ హథీరాంజీ మఠం ఆధ్వర్యంలో ఉన్నప్పుడు యాత్రికులకు సౌకర్యాలు ఏర్పరచాలంటే చాలా కష్టమయ్యేది. ఎందుకంటే అక్కడ ఎవరూ ఉండేవారు కాదు. తిరుమలలోనే ఉందామంటే విపరీతమైన చలి. జంతువుల భయం. కొండమీద ఒక ఊరు తయారైతే, ఈ ఇబ్బందులన్నీ అధిగమించవచ్చన్న ఆలోచనతో 1910–20 కాలం నాటికి జనవాసాలను ఏర్పరచేందుకు ప్రయత్నించారు. వారికి ఆవాసం కల్పించేందుకు హథీరాంజీ మఠం భూములు లీజుకు ఇచ్చింది. నెమ్మదిగా ఆలయం చుట్టూ నాలుగు వీధులతో ఒక ఊరు ఏర్పడింది. మొదట అక్కడి జనాభా 200 నుంచి 300 మంది మాత్రమే! భక్తులకు ఈ కుటుంబాలే అన్ని సౌకర్యాలు కల్పించేవి. క్రమేణా తిరుమలలో ఉండేవారి సంఖ్య 25 వేలకు పెరిగింది. 30 ఏళ్ల క్రితం వరకూ వారంతా రోజూ సరాసరి మహాద్వారం గుండానే గుడిలోకి వెళ్లి శ్రీవారిని దర్శించుకుని తమ పనులు చేసుకొనేవారు.

అలాగే పూజావిధానాల్లోనూ, ఆర్జితసేవా టిక్కెట్ల ధరల్లోనూ నాటికీ నేటికీ హస్తిమశకాంతరం తేడా! ఐదుపదుల ఏళ్లనాటి దేవస్థానం రికార్డుల ప్రకారం అప్పట్లో పొద్దున ఏడున్నరకు సుప్రభాత సేవ, రాత్రి పదిన్నరకు ఏకాంతసేవ జరిగేవి. క్రమేణా రాత్రి రెండున్నరకు ఆలయం మూసివేసి, సరిగ్గా అరగంటలోనే మళ్లీ సుప్రభాతంతో మేల్కొలుపులు మొదలుపెడుతున్నారు. పాపం ఏడుకొండల స్వామికి కునుకే బంగారమైంది.


## నాటి బాల్యం తిరిగి రాదన్నట్లు ఆనాటి తిరుమల గ్రామం కానరాదు!!

**వె**య్యికాళ్ళమండపం కనిపించదు. గొల్ల మండపం కనిపించదు. అక్కడ కొబ్బరి కాయలు కొట్టే దీపారాధనా శోభ, సహస్ర దీపాల తేజంతో స్వామిని ఆరాధించి భక్తుల ప్రశాంతత పొందే అదృష్టం లేదు. వెయ్యికాళ్ల మండపం మెట్లమీద కూర్చుని ఇటు సహస్రదీపాలంకరణ సేవ, అటు శ్రీవారి వాహనసేవలు చూచే అదృష్టం కనిపించదు. నెత్తిన మూటలు, చంకని పిల్లల్నీ ఎత్తుకుని, ఏడుకొండల మెట్లు ఎక్కి వచ్చేవారి అలసట తీరే విశ్రాంత మందిరం వేయికాళ్ల మండపం లేదు! శ్రీవారి దర్శనం చేసుకుని ఎదురుగుండా ఉన్న వేయికాళ్ల మండపంలోని కిటికీ కౌంటర్లలో ప్రసాదం తీసుకునే భాగ్యాన్ని మార్చేసారు. తిరుమల యిప్పుడు మహానగరిలా భాసిల్లుతూంది. ●

# ఇప్పటి తరం తెలుసుకోదగిన ఏ.పి. కోమల

'ఏన్ తంగచ్చి' అంటూ ఆప్యాయంగా పలుకరించే ఎంజీఆర్ జ్ఞాపకాలను మదిలో దాచుకున్న తమిళ తంగచ్చి ఆమె. పి.సుశీల అంతటి గొప్ప గాయకురాలితో 'క్లాసికల్ జీనియస్'గా ప్రశంసలు పొందిన గాయని. ఎన్టీఆర్ స్థాపించిన ఎన్ఏటీ బ్యానర్‌లో చిత్రం ప్రారంభం అవ్వాలంటే ప్రారంభగీతం ఆమె మధురస్వరం నుంచి జాలువారాల్సిందే. సుమధుర గానంతో "కోమల"మైన స్వరంతో శ్రోతల హృదయాల్లో స్థానం సంపాదించిన ఎ.పి.కోమల శాస్త్రీయ సంగీతంలో విరబూసిన రాగ మందారం. నేటి తరం సంగీతాభిమానులకు ఆమె గురించి పెద్దగా తెలియక పోవచ్చు.

ఆమె పూర్తి పేరు ఆర్కాటు పార్థసారధి కోమల. వాళ్ళ తాత ముత్తాతల ఊరు ఆర్కాడు. రాయవేలూరు ప్రక్కన ఉన్న ఊరు ఆర్కాడు. ఆమె 1935 సం॥ము ఆగస్టు నెల 28వ తేదీన మద్రాసు లోని తిరువళిక్కేణి (ఇప్పటి ట్రిప్లికేన్) పార్థసారధి లక్ష్మమ్మల తొమ్మిదిమంది సంతానంలో 6వ సంతానం. తండ్రి పోవడంతో తోబుట్టువుల బాధ్యతా అంతా కోమలపైననే పడింది. తత్కారణంగా ఆమె కన్నెకోమలి గానే ఉండిపోయింది. 5 వేల పాటలకు పైగా పాడినా, మిగుల్చుకున్నది వయసుతక్క మరేవీ లేదు. తనతో బాటే వివాహం చేసుకోని సోదరితో చెన్నయ్ లోని మడి పాక్కంలో ఉంటున్నారు. అలనాటి పి. లీల వంటి ప్రముఖ గాయనిలతో పాటలు పాడిన కోమలను పూర్తిగా సినిమారంగం మరిచి ఉంటుందనుకోను; ఎటొచ్చీ సహ కారమే చేయరు!



**ఆలిండియా రేడియోలో ఉద్యోగం**

రేడియో కార్యక్రమాలు నిర్వ హించు యండమూరి సత్యనారా యణ చాలా సుప్రసిద్ధులు. పాత తరం రేడియో శ్రోతలందరికీ ఆయన గురించి బాగా తెలుసు. ఆయన కార్యక్రమం ప్రారంభం కావడానికి 10 నిమిషాల ముందు పాట రాసేవారు. ఆ పాటని అప్పటికప్పుడు నేర్చుకుని ఆమె పాడేవారు. దాంతో ఆమెలోని ప్రతిభను గుర్తించి 1944లో రేడియోలో ఆర్టిస్టుగా ఉద్యోగం ఇచ్చారు. అప్పుడామె 50 రూపాయల జీతం. అప్పుడు రెండో ప్రపంచయుద్ధం జరుగుతుండడంతో వార్ అలవెన్స్ క్రింద మరో 14 రూపాయలు కలిసి మొత్తం 64 రూపాయలు జీతం ఇచ్చేవారు. ఆమె మొదటి సంపాదన అదే. స్వాతంత్ర్యం వచ్చే వరకు ఇప్పటి ట్రిప్లికేన్ నుంచి లాగుడు రిక్షాలో ఎగ్మూర్‌లోని రేడియోస్టేషన్‌కు వెళ్ళి, రిక్షా అతనికి నెలకు 2 రూపాయలు యిచ్చేవారు. ఇప్పుడు రూ. 500 ఇస్తామన్నా వచ్చేవారు లేరు. 46లో ఆమె గారు చనిపోయారు. అప్పటివరకు ఆమె మైనర్‌ని కావడంతో జీతం ఆయనే తీసుకునేవారు. ఇప్పటికీ అందరికీ తెలిసిన రేడియో తాత ఉమామహేశ్వరరావు అప్పట్లో రేడియో అనౌన్సర్‌గా పనిచేసేవారు.

**'త్యాగయ్య'లో తొలిపాట...**

రేడియోలో పనిచేస్తున్న రోజుల్లో ప్రయాగ నరసింహశాస్త్రి సిఫార్సుతో 1946లో చిత్తూరు వి. నాగయ్య తీసిన 'త్యాగయ్య' సినిమాలో తొలిసారి పాట పాడారు. జమునారాణితో కలిసి పాడిన పాట **'మధురానగరిలో చల్లలమ్మ బోదు దారి విడువుము కృష్ణా...'** ఈ పాట పాడినందుకు పారితోషికం 250 రూపాయలు. అలా 'త్యాగయ్య' తర్వాత 'ఆత్మశాంతి', తెలుగులో పి. భానుమతి పాడిన 'గృహప్రవేశం' సింహళ భాష డబ్బింగ్ సినిమాకి సింహళం లో పాటలు పాడారు. రేడియోలో కాకుండా ప్రైవేటు రికార్డులు, సినిమా పాటలు కూడా పాడారు. ప్రముఖ సంగీత దర్శకుడు కె.వి.మహదేవన్ సినిమాల్లోకి రాకముందు గ్రామఫోను కంపెనీలో పనిచేసేటపుడు ఆయన రూపొందించిన యుగళగీతాలు ప్రైవేటు రికార్డులు పాడారు. రేడియో సినిమాలతో పాటు వందల సంఖ్యలో కచేరీలూ చేశారు. ఏ.పి.కోమల గూర్చి అంతగా గాకపోయిననూ కొంతగానైననూ– ఆమె చెప్పుకున్న చరితమునే తెలుసుకుందాం :

## ప్రసిద్ధ నేపథ్య గాయనుల్లో నేను సీనియర్‌ని...

తెలుగు, తమిళ, మలయాళం, కన్నడ చిత్రాల్లో సుమారు 3 వేల పైచిలుకు పాటలు పాడాను. చిన్నతనంలోనే సినిమా పాటలు పాడే అవకాశం రావడంతో నేను పాడిన పాటల్లో చిన్న పిల్లలకు పాడిన పాటలే చాలా వున్నాయి. అది నా అదృష్టం. 'పెళ్ళి చేసి చూడు' సినిమాలో స్కూల్‌కి వెళ్ళకుండా వుండాలని సాకులు చెబుతూ పిల్లలు 'అమ్మా నొప్పులే...' అని పాడతారు. చాలా సరదాగా వుంటుంది. అంజలీదేవి తన సినిమాల్లో నాతోనే పాడించేవారు. హీరోయిన్‌ల విషయానికొస్తే 'రంగులరాట్నం'లో అంజలీదేవికి, 'బాలసన్యాసమ్మ కథ' లో కృష్ణకుమారికి, 'బంగారు పంజరం'లో శ్రీరంజనికి, 'పరమానంద శిష్యులు'లో కేఆర్ విజయకి పాటలు పాడాను.అలాగే సావిత్రి, రాజసులోచన, గీతాంజలి చాలామందికి పాడాను. నేను ఎక్కువగా పాడింది సోలో పాటలే. జానకి, సుశీల, జిక్కి, పి.లీల, బి. వసంత మేమంతా ఎంతో అన్యోన్యంగా ఉండేవాళ్లం. అందరికంటే ఫీల్డ్‌లో నేనే సీనియర్‌ని.

'రక్తరేఖ' సినిమాలో ఘంటసాలతో కలిసి 'ఓహో రాజ సుకుమార...' 'శ్రీలక్ష్మమ్మ కథ'లో 'తాళగజాలనురా' అన్న జావళి, 'అమ్మలక్కలు'లో జిక్కితో కలిసి 'కన్నెమావి తోటలోన...', 'పరాశక్తి' సినిమాలో 'మా తెలుగు తల్లికి మల్లెపూదండ', 'జయ సింహ'లో రావు బాలసరస్వతితో కలిసి 'మనసైన చెలి పిలుపు...' ఇలా ఎన్నో పాటలు పాడాను. 1960లో 'దీపావళి' సినిమాలో 'సరి మాతో సమరాన నిలువ గలడా..' అనే పాట బాగా పాపులర్ అయింది. అలాగే ఘంటసాల గారి సొంతచిత్రం 'భక్తరఘునాథ్'లో 'జయమురళీలోలా...' పాట నాకు చాలా ఇష్టం – వింటుంటే ఈ పాటలు పాడింది నేనేనా అనిపిస్తుంది. మలయాళ దక్షిణామూర్తిగారని 95 ఏళ్లు ఉంటాయి. సంగీతంపై మంచి పట్టు ఉన్న వ్యక్తి. మేము ఎప్పుడైనా కలిస్తే "ఇంకా నువ్వు మారలేదా, ఇప్పటికీ చిన్నపిల్లలాగే మాట్లాడుతున్నావు" అంటుండేవారు. 1974లో గుంటూరు నాగార్జున అకాడమీలో, 1979 మద్రాసు మ్యూజిక్ అకాడమీలో, కేరళలో సద్గురు సంగీత సభ, విజయవాడ కనకదుర్గ కళాసమితిలో ఇలా చాలా కచేరీలే చేశాను. 1991లో తిరుమల శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో కచేరీ చేయడం నా పూర్వజన్మసుకృతంగా భావిస్తాను.

తొలి నాళ్లలో జీతం తక్కువైనా సంతోషంగా ఉండేదాన్ని. రిటైర్ అయ్యేనాటికి 10 వేలకు పైగా పారితోషికం వచ్చేది.

సంపాదించినా సంతోషం దూరమైంది. స్వరానికి, గానానికి రిటైర్మెంట్ అంటూ వుండదు. కానీ గాయని పదవి నుంచి నేను రిటైర్ కాకపోయినా వాళ్లే రిటైర్ చేసేశారు. కంఠంలో మాధుర్యం తగ్గకపోయినా పాశ్చాత్య సంగీతానికి అలవాటు పడిన నేటి సంగీత ప్రపంచంలో చోటులేకుండా పోయింది. అవార్డులైతే వచ్చాయి గానీ ప్రభుత్వం నుంచి ఎటువంటి సహాయం అందలేదు. బతికున్నవారు అష్ట కష్టాలు పడుతుంటే ఆదుకోకుండా, పోయిన తరువాత అవార్డులు, రివార్డులు ఇస్తే మాత్రం ఏంటి ప్రయోజనం? నిజమే కదా! ●

భాద్రపద మాసం శుక్ల పక్ష తదియ

# శ్రీ వరాహ జయంతి

- కె.మల్లిఖార్జున

బ్రహ్మదేవుడు త్రిమూర్తులలో ఒకడు. సృష్టికి మూల పురుషుడు. ఆయన పుత్రుడైన స్వాయంభువమనువు యాగం చేయడానికి తగిన ప్రదేశం లేకుండా పోయింది. ఈ యాగం ఎలా నిర్వహించాలి అనే ఆలోచనల సమయంలో బ్రహ్మదేవుడు నాసిక నుండి యజ్ఞవరాహమూర్తిని అవతరింపచేశాడు. అతను బొటనవ్రేలంతటి వాడు. మరుక్షణమే గజరూప మంతగా పెరిగాడు. మునులు, దేవతలు ఆ వరాహ మూర్తిని స్తుతించి, భూమిని జలం నుండి కాపాడమని ప్రార్థించారు. వెంటనే యజ్ఞ వరాహమూర్తి సముద్రం లోని పాతాళమునకు పోయి, అక్కడ వున్న భూమిని బయటకు తీసుకొని వచ్చాడు. ఆ సమయంలో బ్రహ్మాది దేవతలు భూపతియైన వరాహ మూర్తిని స్తుతించారు. అనంతరం ఆయన భూమిని జలంపై ఉంచి, అదృశ్యమయ్యాడు.



శ్రీహరి దశావతారాలు ఆవిర్భావానికి దుష్ట శిక్షణ, శిష్టరక్షణ కారణం. పూర్వం బ్రహ్మదేవుని మానస పుత్రులైన సనక, సనందన, సనత్కుమార, సనత్సాదులు శ్రీ మహావిష్ణువు దర్శించడాని కోసం వైకుంఠం వెళ్ళారు. ద్వారం దగ్గర శ్రీహరి ద్వారపాలకులైన జయ, విజయులు వారిని లోపలికి వెళ్ళకుండా అడ్డగించారు. దీనితో కోపోద్రిక్తులైన బ్రహ్మమానసపుత్రులు, వారిని "మీరు మూడు జన్మలపాటు శ్రీహరికి విరోధులై జన్మింతురుగాక" అని శపించారు. మొదటి జన్మలో హిరణ్యాక్ష హిరణ్యకశిపులుగా, రెండవ జన్మలో రావణ కుంభకర్ణులుగా, మూడవ జన్మలో శిశుపాల, దంతవక్త్రులుగా జయవిజయులు జన్మించారు.

బ్రహ్మమానస పుత్రులైన సనకసనందాదుల శాపకారణంగా జయ విజయులు దితి, కశ్యప మహర్షులకు హిరణ్యాక్షుడు, హిరణ్యకశిపుడు పుత్రులుగా జన్మించారు. వీరిద్దరూ బ్రహ్మదేవుని గురించి ఘోరతపస్సు చేసి వరాలను పొందారు. వారిరువురు వరగర్వంతో మునులను, సన్యాసులను, సకల లోకవాసులైన దేవతలను హింసించారు.

ఒకమారు హిరణ్యాక్షుడు ఈ భూమండలాన్ని తీసుకొని వెళ్ళి సముద్ర గర్భంలో దాచిపెట్టాడు. శ్రీ మహావిష్ణువు యజ్ఞ వరాహ అవతారాన్ని ధరించి హిరణ్యాక్షుడిని అంతమొందించి భూమిని ఉద్ధరించాడు. వరాహస్వామికి భూవరాహస్వామి, ఆదివరాహస్వామి అనే పేర్లు ఉన్నాయి.

యుద్ధ సమయంలో వరాహమూర్తికి కలిగిన శ్రమ కారణంగా శరీరానికి చెమట పట్టింది. 'శ్రీ ముఖం' అనే పేరుతో ప్రసిద్ధికెక్కింది. ఇక్కడ భూదేవీ సమేతుడైన వరాహమూర్తి సాలగ్రామ మూర్తిగా వెలసి ఉన్నారు. శ్రీ మహావిష్ణువు స్వయంగా వెలసిన ఎనిమిది దివ్యక్షేత్రాలలో ఇది ఒకటి.

ఇక్కడ పుష్కరిణీ స్నానం, అశ్వత్థ వృక్ష మూలమూ, వరాహ కవచ జపం వలన ఆరోగ్యం సిద్ధిస్తుందని నమ్మకం. శతృపీడలు, గ్రహ పీడలు తొలగిపోతాయి. తిరుమల క్షేత్రములో పుష్కరణికి సమీపంలో భూదేవి సమేత వరాహస్వామిదేవాలయం ఉన్నది. శ్రీ వేంకటేశ్వరస్వామికి తిరుమలలో ఉండడానికి స్థలం యిచ్చిన వరాహస్వామి వారే క్షేత్రపాలకుడు. అందుకు తిరుమలకు వెళ్ళిన భక్తులు ముందుగా వరాహస్వామిని దర్శించుకొని, శ్రీ వేంకటేశ్వర దర్శనానికి వెళ్ళాలని నిబంధనం ఉన్నది.

**"శ్వేతం వరాహ పుషం క్షితి ముద్ధరస్తం**
**శంఖాది సర్వ వరదా భయ యుక్త బాహుం ।**
**ధ్యామేన్నిజైశ్చ తనుభిః సకలైశ్వర పేతం**
**పూర్ణం విభాం సకల వాంఛిత సిద్ధమ్ జయే॥**

అంటే శ్వేత వరాహ శరీరుడైన, భూమిని పైకి ఎత్తుచూ, శంఖచక్రవరద అభయహస్తములు గల చతుర్భుజుడై, తన రూపములు అన్నింటిలో కూడిన పూర్ణరూపుడగు విభుని సకలాభీష్ట సిద్ధి కొరకు ధ్యానించాలి.

హైందవ సంస్కృతి అనుసరించు భాద్రపద మాసంలో శుక్లపక్ష తదియ రోజు, హిరణ్యాక్షుడనే రాక్షసుడిని సంహరించి ఈ భూమండలాన్ని సముద్రగర్భం నుంచి పైకి తీసుకురావడానికి శ్రీహరి వరాహ అవతారాన్ని ధరించిన రోజును వరాహ జయంతిని జరుపుకొనటం మన సంప్రదాయం. ఈ వరాహ జయంతి రోజు, శుచి శుభ్రత కలిగిన వస్త్రాలను ధరించవలెను. ఇంటిని శుభ్రపరచి పూజామందిరములో, బియ్యపు పిండితో అష్టదళ పద్మం ముగ్గు వేసి, దానిపై పూజా పీఠమును ఏర్పాటు చేసుకోవాలి. అనంతరం భూమాత సమేత వరాహస్వామి ప్రతిమనుగానీ, చిత్రపటమునుగాని పీఠంపై ప్రతిష్ఠించాలి. వినాయకుని పూజ అనంతరం వరాహస్వామిని షోడశోపచారాలు, అష్టోత్తర శతనామావళితో పూజించాలి. శక్తి మేరకు నైవేద్యమును సమర్పించాలి. ఆరోజు స్వామిని పూజించడంతో పాటు వైష్ణవాలయాలను దర్శించడం, విష్ణుసహస్రనామ పారాయణం చేయడం చాలా మంచిది. ●

## ఆంధ్రౌన్నత్యం

**కొరతలు లేని ఆంధ్రౌన్నత్యం - కొలతలేని ఆంధ్రదేశము!**
**ఎక్కడ చూచినన్ సరసులెక్కడ చూచిన దేవమందిరం**
**బెక్కడ చూచినన్ వనములెక్కడ చూచిన పైరు పచ్చలే**
**ఎక్కడ చూచినన్ తటినులెక్కడ చూచిన పుష్ప వాటికల్**
**చక్కని ఆంధ్రదేశము ప్రశస్త ప్రకాశము నెన్న శక్యమే**
**ఆంధ్ర నదులు :**
**ప్రవహించు నెచ్చోట పరమపావనియైన గౌతమీ గంగమ్మ కడలి కొమ్మ**
**ప్రవహించు నెచ్చోట పరమపావనియైన తుంగ గంగాభద్ర తుంగభద్ర**
**ప్రవహించు నెచ్చోట పరమపావనియైన హేరాళజలపాణి కృష్ణవేణి**
**ప్రవహించు నెచ్చోట పరమపావనియైన మన్నుపొన్నొ నరించుమిన్న పెన్న**
**ఆ త్రిలింగ భూభాగమం దాంధ్రుడవుగ**
**జన్మ మొందుట యెన్నెన్ని జన్మముల సు**
**కృతఫలంబో యెంచకొను మోయీ రవంత**
**అమల గు ధృతి ఓ ఆంధ్ర వీర**
**ఆంధ్ర దేవతలు**
**వారణాసిని వీడి వ్యాసుడు కాల్నడక ఏతెంచి కన్న భీమేశ్వరుండు**
**శ్రీ కాళహస్తుల సాకల్యకైవల్య మిడి ప్రోచినట్టి కాలేశ్వరుండు**
**తిలకించినంతనే మలి జన్మ లేకుండ ఆదుకొనెడు మల్లికార్జునుండు**
**ఆసేతు హిమశైలమందలి జనముల దేవుడు వెంకటేశ్వరుండు**
**నాల్గుదిక్కుల నిన్ను అహరహంబు**
**కంటిని రెప్ప పోలి కాచుచుండ**
**అన్నివిధముల నభివృద్ధి నంది నీవు**
**దేశమును తీర్చిదిద్దుమా తెలుగు తండ్రి**

(ముఖ పుస్తకములో చెప్పబడినవేవీ ముఖస్తుతులు కావు;
ఇవి సత్యములై వర్ధిల్లినవి శాన బాగు బాగు!)

# వొడి దుడుకులను వొడిసిపట్టలేదు – గానీ ఎక్కడకక్కడ సమాధానపడుతూ వచ్చాను!

నా జీవితం ఆనందమయమూ కాదు; ఆవేదనాభరితమూ కాదు? ఆరోహణ అవరోహణ క్రమము.

తూర్పుగోదావరి జిల్లా కస్తూరివారి సావరం మాతామహులింట జన్మించాను. పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లు సమీపంలో పెరిగాను. మావూరిలో మా తాతగారు నిర్మించిన శివాలయం రామలింగేశ్వరుడు– అక్కడ జమీ, ఆస్తిపాస్తులు కరిగిపోయాయి కదా– క్షీరారామ లింగేశ్వరుడున్న పాలకొల్లుకు వెళ్లి చదువుకోమని పంపించాడు. ఐదు సంవత్సరాల తరువాత 1942 సం॥ములో వచ్చిన గాలివానకు మేము కట్టుకున్న నేలమట్టమైంది. మా అమ్మ టైఫాయిడు జ్వరంతో ఆ రోజు రాత్రే చనిపోయింది. అప్పటికి పదేండ్ల ప్రాయం. అమ్మ చంకదిగీ యెరుగను! అన్నం కలుపుకుని తినీ యెరుగను! అక్కడే చదువు– అక్కడి పాఠశాలలోనే అధ్యాపక పదవి. ఓ పుష్కరం గడిచేసరికి పావురాయిలా చెన్నయ్ చేరుకున్నాను. వచ్చిన వేళా విశేషం ఆంధ్రకేసరి ప్రకాశం పంతులుగారి 'ప్రజాపత్రిక'లో ప్రూఫురీడరు కమ్ టు సబ్ఎడిటర్. ఆనాటి నానుడి యేమంటే 'ఆనందవాణి' వారపత్రికలో సంపాదకుని పనిచేయనివాడు పత్రికా ఎడిటరే కాదనేవారు! శ్రీశ్రీ, ఆరుద్ర, రామలక్ష్మి, రావికొండలరావు ఆదిగాగల మహా రచయితలందరూ అక్కడ పనిచేసినవారే! ఇలాగే ఉన్న ఉద్యోగం ఊడడం, కొత్తగా ఉద్యోగం దొరకడం. ఏడాదికి వచ్చే రెండు ఆరునెలలు రెండు ఉద్యోగాలు. ఈనాడవన్నీ తలచుకుంటూంటే 1720 – 1785 సం॥ మధ్యకాలపు అడిదం సూరకవి గారి సీసపద్యంలోని భావం వీసమెత్తయినా తప్పిపోలేదు.

**సీ॥ సూర్యుడు తన శితాంశువుల బోదటిమిన !**
**కలుగదే గుహలు చీకట్లుదాగ**
**ఝుంఝూ నిలము దాడి సలుప దీపమునకు**
**కలుగదే వసియింప కలశమొకటి!**
**వని సాళువంబు గువ్వను బాఱ దటిమిన**
**తరుకోటరము లేదె దానిబ్రోవ –**
**గరుడుండు వెనుచన కాకోదరమునకు**
**కలుగదే వల్మీక బిలము నొకటి !**
**ప్రబలుడగువాడు దుర్బలు పాలుదరిమిన**
**దైవమొక ప్రాపు గల్పింప దలపకున్నె?**
**పొరలుగాక తనహంకారమున నరుండు**
**రామలింగేశ! రామచంద్రపురవాస!**

– చిమ్మ చీకట్ల వెంటబడి సూర్యుడు తన నిశిత కిరణాలతో తరిమికొడుతూంటే హాయిగా దాగుకునే గుహలే కనిపించవా! (కాలయవనుడు తరముకొస్తున్నపుడలాగే కొండగుహల్లోకి వెళ్లి దాగాడు) చిన్న దీపంపై ఝుంఝుం నిలంగా పెద్దగాలి దాడి చేసినట్లు వస్తే ఓ చిల్లుల పాత్ర (కలశం) లో కాపాడుకోగలడు. అమాయకమైన శాంతికాముక పావురాన్ని క్రూరమైన డేగ తరుముకొస్తుంటే – దాని రక్షణకొక చెట్టు తొర్రయైనా లభిస్తుంది. నేలమీద పాకుతున్న పామును గగనంపై విహరిస్తున్న గరుడుడు వెంటాడుతుంటే ఒక వల్మీకం (పుట్ట) దొరుకుతుంది. కండకావరంతో, బలదర్పంతో, అహంకారాసూయలలు కల బల(గ)వంతుడు బాధిస్తున్నప్పుడు ఆపద్రక్షకుడైన భగవంతుడు రక్షించకుండా ఉంటాడా? రామలింగేశ యను భావ ప్రకటితాన్ని భరోసా చేసుకుంటూ, అలవాటు పడ్డాను. పుష్కరానికొక మార్పు వచ్చేది. మరల యేడాదికి వచ్చే అంత్య పుష్కరంలా కథ కంచికి వెళ్ళేది.

మా నాన్నగారు పోయినప్పుడొకసారి, ఉద్యోగం ఊడింది. క్షీరపురి (పాలకొల్లు)లో పెళ్లి చేసుకుని, గృహస్థుణ్ణయి చెన్నయ్ వచ్చిన వెంటనే ఒకసారి ఉద్యోగం ఊడింది. పెళ్లికి బహుమతిగా వచ్చిన వెండిగ్లాసుని తాకట్టు పెట్టి రూ.10/లు (పదిరూపాయలు) తెచ్చుకుని ఇంట్లో వెచ్చాలు తెచ్చుకున్నాను.

(అప్పటికి రూ.10 పదిరూపాయలకు) విలువ ఉంది. బట్టలకొట్టులోనూ, బంగారు దుకాణంలోనూ, కిరిణ దుకాణంలోనూ నెలల తరబడి నన్ను నమ్మి అప్పులిచ్చేవారు.

చెన్నయ్ నగరం తెలుగు సాహిత్య, కళా, సాంస్కృతిక వేదిక, 1958 సం॥ములో మధురవాణి పక్షపత్రికను ప్రారంభించిన రోజుల్లో 30 తెలుగు పత్రికల వరకూ మద్రాసు (చెన్నపట్నం) నుండే ప్రచురింపబడేవి. ఆ నాటి నుంచి నాకు ఆర్యవైశ్యులు, రెడ్లు బాసటగా నిలిచారు. నికరమైన సంపాదన లేని రోజుల్లో నా భార్య సత్యవతి సంసార నిర్వహణం సమర్థంగా ఆదా చేస్తూ నిర్వహిస్తూ, ఎంతో ఉత్సాహాన్ని కల్గిస్తూ వచ్చింది. స్వంతంగా స్థలం కొనుక్కుని చక్కటి భవనం కట్టుకోగలిగాను. రెండునెలలకో ఋతువు అన్నట్లు పీఠాధిపతులు, ఆచార్యులు, సూర్యోపాసకులు, బాబాలు గృహ సందర్శనం చేస్తుండేవారు. ఇరవై, ముప్ఫైమందికి పైగా అతిథులు భోజనం చేస్తూండేవారు. అనేక వ్రతాలూ, పూజలు జరిపిస్తూ వారి అతిథి సత్కారముల్చేయడం వల్లనేమో నాకు సత్కరాలు జరుగుతు వస్తున్నాయ్. నా గృహం పావనగృహంలా యీనాటికీ విలసిల్లుతూంది. నా ముగ్గురు (వేంకటేశ్వరరావు, నారాయణరావు, నాగసాయి ప్రసాద్) కుమారులను పట్టభద్రుల్ని చేయగలిగాను. యీ జన్మలో వారు నా కుమారులయ్యారు. పూర్వజన్మలో ఏ సాధు పరమహంసలై ఉంటారు. ఉత్తమగుణాలూ కలవారు. సనాతన ధర్మం పట్ల విశ్వాసం కల్గినవారు. కోడళ్ళను కూతురులనే చెప్పాలి. కోట్ల ఆస్తి కలిగి ఉన్నా ఇంతటి సంతోషం కలుగదు. సంతోషం వెనుక భగవంతుడు విషాదాన్ని కలిగిస్తాడన్నది సహజ నిజం.

2003 ఏప్రిల్ 19న నా సహధర్మచారిణి నన్ను వీడి శ్రీవేంకటేశసాయిల్లో లీనమైంది. నా జీవితాని కదొక పెద్దదెబ్బ. వివాహకాలంలో కలిసి నడిచివచ్చే తొలి నా సప్తతి సంవత్సరంలో దేవుడు విడదీశాడు. నా షష్ట్యబ్దిని ఆమెతో ఘనంగా జరుపుకున్నాను. ఆ వెనుక 62 వ సంవత్సరంలో ప్రముఖాంధ్రను ప్రారంభించాను. అప్పట్నుంచీ ఆలోచనములే నన్ను భౌతికంగా మానసికంగా నీరసింపచేస్తూ వచ్చాయ్. కొడుకు వేంకటేశ్వరరావుతో ప్రముఖాంధ్ర పతిక్ర ప్రారంభించాను. ప్రముఖాంధ్ర మాసాభివృద్ధి దశగా ఎదుగుదల ప్రారంభమైంది. ప్రపంచంలోని తెలుగువారందర్నీ నా వాళ్లుగా చేస్తూ వచ్చింది. వారు అపారమైన అనురాగవాత్స్యలములు నాపై సారింప చేయడంతో నన్నభిమానంచే పాఠక సార్వభౌములు బంధువర్గంగా మారారు. ప్రపంచంలోని వారందర్నీ వసుధైక కుటుంబంగా చూసుకొనే అదృష్టాన్ని ఏడుకొండలవాడు అనుగ్రహించాడు. షిర్డీ సాయినాథుడు ఆశీర్వదిస్తున్నాడు. పలు ఆశ్రమ గురువులు, పీఠాధిపతులు, ఆశీః వచనములతో దీవించడం 83 సంవత్సరాల వయసులో కూడా 38 ప్రాయపు రచయిత కుండే రచనా పటిమ తెలుగు తల్లి అనుగ్రహంతో కొనసాగుతూంది.

పత్రిక ఉంటే పదివేల సైన్యమున్నట్లని నార్ల వేంకటేశ్వరరావు గారన్నారు. అంతమంది పాఠక బలం కల్గించే విశ్వాసం ఒక ప్రక్క, వెళ్లిన దేశాలలో తెలుగు వారంతా నా వారే నన్న ధీమా కలిగించింది. సాహిత్యానికి తోడు భక్తిని రంగరిస్తూ ప్రముఖాంధ్రకో ఒరవడి నెంచుకున్నాను. విశ్వంలో ఉన్న అన్ని దేశాల్లోనూ తెలుగు వారున్నారు. తెలుగు సంస్కృతిని పాటిస్తున్న వారున్నారు. తెలుగు భాషను మాట్లాడు తున్నవారున్నా కానీ వారు యెక్కడికక్కడి వారుగానే ఉన్నారు. వారందరిలో కొందరి నైనా మరికొందరికి పరిచయం చేస్తూంటే బాగుంటుందికదాయనెడు సంకల్పం కలిగింది.

**పాతక్రొత్తలను మేళవించీ**
**పాడరా ఓ తెలుగువాడా – పదం**
**పాడరా ఓ కలిమి తేడా!!**
**తెలుగుదేశము తేజరిల్లగ–**
**తెలుగువెలుగులు దిశల నిండగ**
**పాడరా! పదం పాడరా తెలుగువాడా**

అని నేనన్నది ఓ బ్రహ్మాండమైన రాజకీయ పార్టీ ఏర్పడడానికి– ఊతమైందేమో అనుకుంటూ ఉంటాను. కట్టాసుబ్బారావు దర్శకత్వం నెఱపుతున్న చిత్రం ఔట్డోర్ షూటింగు ఊటీలో జరుగుతున్నప్పుడీ సంకల్పం ఎన్టీయార్‌గారికి కలిగింది. నాదెండ్ల భాస్కరరావుగారితో కలిసి తెలుగుదేశం పార్టీని నెలకొల్పారు. నటరత్న ఎన్టీఆర్‌గారు ఆ సంకల్పంతోనే సూరవరపు రాజ్యలక్ష్మీదేవిగారి 'తెలుగుదేశం' వార పత్రిక హక్కులను తీసుకుని ఉండవచ్చునన్నభిపాయ్రం నాకీనాటికీ ఉన్నది.

గొటేటి ఫిలిమ్‌డైరీని వేస్తూన్న అనుభవంతో ప్రముఖాంధ్ర డైరీ వేయాలనే సంకల్పం కలిగి, ఆ సంకల్ప భావం ప్రముఖాంధ్ర పత్రికగా రూపుదిద్దుకుంది.

**గోటేటి శ్రీరామారావు గోరంత కథ.**

(శీర్షిక కొనసాగించకలిగిన సశేషం)



# అచ్చ తెలుగు స్త్రీ తేజం అచ్చమాంబ

స్త్రీలలో సెలబ్రిటీలెవరు అని మన కాలేజీ పిల్లల్ని అడిగితే టక్కున హీరోయిన్ల పేర్లు చెబుతారు. అందం, అంగాంగ ప్రదర్శనం, డబ్బు, వెర్రి అభిమాన జనం.. ఇవే కదా కొలతలు! మన తెలుగింటి ఆడపడుచు ఒకామె పుట్టింది కోస్తాలో, బాల్యం తెలంగాణాలో, ఎదిగింది మహారాష్ట్రలో. పదేళ్లకే పెళ్లి జరిగింది. స్కూలు ముఖం తెలీదు. అయితేనేం తొలి కథ రాసింది ఆమే. మొదటి స్త్రీ సమాజాన్ని స్థాపించింది ఆమే. స్త్రీల చరిత్ర రాసి ప్రథమురాలైంది. అనాథల్ని అక్కున చేర్చుకుంది. స్త్రీ చైతన్య స్ఫూర్తి ప్రదాత అయింది. ఇంతా చేసి ఆమె 30 ఏళ్లే జీవించింది. ఆమె పేరు భండారు అచ్చమాంబ.

అచ్చమాంబ కృష్ణాజిల్లా నందిగామలో 1874లో పుట్టింది. తండ్రి కొమర్రాజు వెంకటప్పయ్య, తల్లి గంగమాంబ. అచ్చమాంబకి వేంకట లక్ష్మణరావు అనే తమ్ముడున్నాడు. ఆమె ఆరేళ్లప్పుడు తండ్రి మరణించాడు. ఆ కుటుంబం నంది గామలో ఉండలేని దుస్థితి ఏర్పడింది. అచ్చమాంబ తల్లి పిల్లల్ని తీసుకుని నల్గొండ జిల్లా దేవరకొండకు వెళ్లిపోయింది. సవతి తమ్ముడు భండారు మాధవరావు పంచన చేరింది. అతడు నిజాం సర్కారులో ఉద్యోగి. అప్పటికే పెళ్లయ్యింది. ఓ కూతురు. భార్య మీనాక్షి చనిపోయింది.

అచ్చమాంబ చిన్నతనం గడిచిందంతా దేవరకొండలోనే. ఎప్పుడూ కేరింతలు కొడుతూ, తమ్ముడ్ని ఆడిస్తూ, మీనాక్షికి తానే తల్లిలా దీపంలా జీవించింది. చిన్నపిల్ల అయినా చకచకా ఇంటిపనులు చేసేది. అంతలో ఆమెకు పదేళ్లొచ్చాయి. పెళ్లీడొచ్చిందని కంగారుపడింది తల్లి. ఆ రోజుల్లో అంతే! బయటి సంబంధం తెచ్చే స్తోమత లేదు. తమ్ముడికి భార్య లేదు. లోకం తెలీని అమాయకురాలు. అచ్చమాంబ ఆయన ఇల్లాలైంది. కొమర్రాజు అచ్చమాంబ కాస్తా భండారు అచ్చమాంబ అయ్యింది. అంతలో మాధవరావుకి నాగ్‌పూర్ బదలీ అయ్యింది. భర్తతోపాటు అచ్చమాంబ, వారితోపాటు గంగమాంబ, మీనాక్షి, లక్ష్మణరావు.. మరాఠా ప్రాంతానికి వెళ్లిపోయారు. పన్నెండేళ్లు వచ్చేసరికి అచ్చమాంబ ఇంటిపెద్ద. తల్లి సాయంతో ఇంటి పనంతా తానే చేసేది. మీనాక్షిని కంటికి రెప్పలా చూసుకునేది. తమ్ముడికి చదువు చెప్పేందుకు రోజూ ఓ మాస్టారు ఇంటికొచ్చేవారు. ముగ్గులు పెడుతూ, కుట్లు అల్లుతూ, ఊరగాయ పెడుతూ.. తానూ ఆ పాఠాలు వినేది. అలాగే హిందీ, సంస్కృతం, గుజరాతీ నేర్చుకుంది. తమ్ముడితో కూర్చుని తెలుగు పుస్తకాల్ని చదవడం మొదలెట్టింది. చుట్టుపక్కల అమ్మలక్కలతో చనువుగా ఉండేది. పట్టుమని 15 ఏళ్లు కూడా లేని ఆమె చలాకీతనం అందరినీ దగ్గర చేసింది. తనకు మరాఠీ రాదు. వాళ్లకు తెలుగు రాదు. కానీ అందరినీ పోగేసి మీటింగులు పెట్టేది. మరాఠీ భక్తి సాహిత్యాన్ని సంఘసంస్కరణ సాహిత్యాన్ని చదవగలిగేంత వరకూ చదువు వచ్చింది.

మరాఠీలోని 'ఆనందీబాయి చరిత్ర' చదివాక, అచ్చమాంబలో చెప్పలేనంత మార్పు, అంతవరకు అణగి ఉన్న ఆమెలోని అబలా చైతన్యం పెల్లుబుకింది. అచ్చమాంబకు ఇద్దరు పిల్లలు పుట్టారు. పదేళ్లు నిండకుండానే మీనాక్షికి కూడా పెళ్లి చేసేశారు. అత్తారింటికి పంపేశారు. ఇంతలో తమ్ముడు పెరిగి పెద్దవాడయ్యాడు. బీఏ పూర్తి చేశాడు. ఎంఏ కోసం కలకత్తా వెళ్లాడు. సెలవులకొచ్చిన ప్రతీసారీ కొత్త కొత్త పుస్తకాలు తెచ్చేవాడు. తేవడంతోనే చదివేసేది.

కొని విషాదాలు ఆమెను తోసుకుంటూ వచ్చాయి అచ్చమాంబ బతుకులోకి. కాపురం కలకాలం సాగకుండానే మీనాక్షి భర్త చనిపోయాడు. పుట్టెడు దుఃఖంతో పుట్టింటికొచ్చేసింది మీనాక్షి. ఆమెను గుండెలకు హత్తుకుని ధైర్యం చెప్పింది అచ్చమాంబ. కానీ అప్పుడాలోచించింది. మీనాక్షిలా జీవితంలో భరించలేని కష్టాలు పడుతున్న అభాగినులెందరో! తనకు తోచిన నాలుగు మాటల్ని కాగితంపై పెడితే, వాటిని చదివినవారు ఒక్కరైనా స్థైర్యం పొందితే జీవితం ధన్యం. అలా తొలిసారి 24 ఏళ్ల వయసులో కలం పట్టింది. 1898 ఆగస్టు 'తెలుగు జనానా' పత్రికలో ఆమె తొలి వ్యాసం వచ్చింది. ఇక ఆ వ్యాసపరంపర ఆగలేదు ఉద్యమంగా మారింది. స్త్రీలలో తేజం నింపింది.

**రాముని కొలవవె మనసా! రాముడె శ్రీరామ రక్ష మనసా!!**


Beautiful City - Beautiful Hotel



DO NOT MISS

Foreverar your Serivice in the Heart of Visakhaparnam

HOTEL Daspalla


Suryabagh, Visakhapatna - 520 020, A.P., India.
Ph : 2564825 (6 Lines), 2563141 (4 Lines), Fax : 91-0891-2562043
E-mail : dspvizag1@rediffmail.com, Visit us at : www.daspallahotels.com
Call National Toll Free No. : 1800-425-4225

We Provide your comfortable Stay and Tasty Food Hospitality

Bhimas Deluxe Hotel
(PROPRIETORS BHIMAS HOTELS LIMITED)
34-38, G.Car Street (Near Railway Station),
TIRUPATI - 517 501 (A.P.)
Phone : 0877-2225521, 6669199, Fax : 2225471
Website : www.bhimasdeluxehotels.com
E-mail : bhimasdeluxe@rediffmail.com

# హైదరాబాదు భారతయూనియన్‌లో కలిసిపోవాలని ఉద్యమం చేసిన స్వామి రామానందతీర్థ!

## నిజాము ప్రభుత్వం స్వామివారిని అనేక జైళ్ళల్లో ఉంచి హింసించింది!!



**1948** సం॥ములో భారతసైన్యానికి లొంగిపోయిన నిజాము ప్రభుత్వం స్వామి రామానందతీర్థను సెప్టెంబరు 17న విడుదల చేసింది. కార్మికవర్గం కోసం స్వామివారు అవిశ్రాంత పోరాటం చేసారు. ఆరోగ్యం క్షీణించింది. అటుపిమ్మట మరాఠాలోని హిప్పరిలో ఉన్న జాతీయ ఉన్నత పాఠశాలలో ఆరుసంవత్సరాలు గురుకుల పద్ధతిని ప్రధానోధ్యాయునిగా చేసి గురుకుల విద్యకు ప్రాధాన్యతను తెచ్చారు.

ఆంధ్రప్రదేశ్ యేర్పడిన తరువాత ఆయన ఉస్మానియా విశ్వవిద్యాలయ సెనేట్‌లో 1957 నుంచీ సభ్యునిగా ఉన్నారు. ఆయన తెలంగాణా విముక్తి పోరాటంలోనే గాకుండా, వినోభాబావే ప్రారంభించిన భూదాన ఉద్యమంలో కూడా ప్రధానంగా పాల్గొన్నారు. ఆయన అస్కలిత బ్రహ్మచారి. అకళంక దేశభక్తుడు. ఇలాటి నీతి శీలురను రాజకీయాల్లో మనం వినలేము. ఇక చదవండి.

హైదరాబాదు స్వాతంత్ర సమర నాయకుడు స్వామి రామానంద తీర్థ. ప్రముఖ కాంగ్రెస్ అభిమాని. కార్మికనాయకుడు. విద్యావేత్త. ఆయన అసలు పేరు వెంకటరావు ఖేడ్గీకర్. తండ్రి బాపూరావు. తల్లి యేసుబాయి. 1903 అక్టోబరు 3వ తేదీన అప్పటి హైదరాబాదు సంస్థానంలోని గుల్బర్గా జిల్లా షవర్గీ తాలూకా సింధ్గీ గ్రామంలో జన్మించారు. ఉన్నత పాఠశాల విద్యార్థిగా ఉండగానే 1920 జూలై 31వ తేదీ రాత్రి లోకమాన్య బాలగంగాధర్ తిలక్ కాలధర్మం చెందారన్న వార్త విని, కలత చెంది, బ్రహ్మచారిగా తన జీవితాన్నంతా మాతృభూమి సేవకే అంకితం చేస్తానని ప్రతిజ్ఞ చేసారు. ఆయన ధీరోదాత్తుడు. కళాశాల చదువునకు స్వస్తి చెప్పారు. పూనాలోని తిలక్ విద్యాపీఠ్‌లో మూడేళ్లు అధ్యయనం చేసి, ప్రజాస్వామ్యం, దాని క్రమాభివృద్ధి అనే అంశంపై సిద్ధాంత వ్యాసం రాసి పూనా విశ్వవిద్యాలయం ఎం.ఏ. పట్టాని పొందారు. 1932లో స్వామి నారాయణ అనే గురువు వీరికి 'విద్వత్ సన్యాసం' అనే పద్ధతి ప్రకారం సన్యాసదీక్ష ఇచ్చి, ఈయనకు 'స్వామి రామానందతీర్థ' నామకరణం చేశారు. 1938లో రాజకీయ రంగంలోకి ప్రవేశించారు. మహారాష్ట్ర పరిషత్తుకు కార్యదర్శిగా పనిచేసి, ఆ సంవత్సరమే తన నివాసాన్ని మోమినాబాదు నుంచి హైదరాబాదుకు మార్చారు. స్టేట్ కాంగ్రెస్ అనే సంస్థను ప్రారంభించడానికి స్వామీజీ ప్రయత్నం చేస్తుండగా, స్టేట్ కాంగ్రెస్ సంస్థను నిజాం ప్రభుత్వం 1938 సెప్టెంబర్లో నిషేధించింది. ఆయన నిషేధాజ్ఞలను పాటించ లేదు. నిరశనగా స్వామి రామానంద తీర్థ హైదరాబాదులో 1938 అక్టోబరు 27వ తేదీన సత్యాగ్రహం చేసారు. ప్రభుత్వం ఆయన్ను బంధించి, 18 నెలలు కఠిన శిక్షనమలు చేశారు. స్టేట్ కాంగ్రెస్‌సంస్థపై నిషేధం తొలగించని కారణంగా, వ్యక్తిగత సత్యాగ్రహం చేస్తానని స్వామీజీ అప్పటి హైదరాబాద్ నిజాం ప్రభుత్వానికి తెలియచేయగా, 1940సెప్టెంబర్ 11వ తేదీన ఆయనను బంధించి. ప్రజారక్షణ నిబంధనల క్రింద ఉంచారు. 1942 – 1950 సంవత్సరాల మధ్య హైదరాబాదు స్టేట్ కాంగ్రెస్ అధ్యక్షులుగా ఉన్నారు. దేశీయ సంస్థానాల మహాసభ కార్యనిర్వాహక వర్గ సభ్యులుగా ఉన్నారు. 1942 ఆగస్ట్‌లో క్విట్ ఇండియా ఉద్యమ తీర్మానం ఆమోదింపబడ్డ బొంబాయి కాంగ్రెస్ సభలో పాల్గొని, షోలాపూర్ నుంచి తిరిగి వచ్చారు. ఆయనను వెంటనే నిజాం ప్రభుత్వం బంధించి, 1943 డిసెంబరులో విడుదల చేసింది. హైదరాబాదు సంస్థానం భారత యూనియన్ విలీనం కావాలని ఉద్యమాన్ని ప్రారంభించినందుకు ఆయనను 1948 జనవరిలో బంధించి, అనేక జైళ్ళల్లో ఉంచారు. నిజాం సైన్యం భారత ప్రభుత్వ సైన్యానికి లొంగిపోయిన 1948 సెప్టెంబర్17వ తేదీన రామానంద తీర్థ స్వామి నిర్భంధం నుండి విడుదల పొందారు.

రామానంద తీర్థ నాందేడ్‌లోని పీపుల్స్ కాలేజి వ్యవస్థాపకులు. హైదరాబాదు ఖాదీ సమితి వ్యవస్థాపక అధ్యక్షులు. హైదరాబాదు హిందీ ప్రచార సంఘానికి అధ్యక్షులు, 1952లో హైదరాబాదు కాంగ్రెస్ కమిటీకి అధ్యక్షులుగానూ ఆయన పనిచేశారు. 1952 నుండి 1962 వరకు లోక్‌సభ సభ్యులుగా ఉన్నారు. 1953లో హైదరాబాదు నగరంలో ప్రప్రథమంగా జరిగిన అఖిల భారత కాంగ్రెస్ మహాసభకు స్వామీజీ ఆహ్వాన సంఘాధ్యక్షులుగా వ్యవహరించారు. హైదరాబాదు సంస్థానాన్ని భాషా ప్రాతిపాదికపై విభజించాలని 1953లోనే గట్టిగా కోరిన స్వామీజీ ఎనిమిది తెలంగాణా జిల్లాలను మద్రాసు రాష్ట్రం నుండి విడిపడ్డ ఆంధ్ర రాష్ట్రంలో కలిపి, తెలుగు ప్రజల చిరకాల వాంఛితమైన విశాలాంధ్రను ఏర్పాటుచేయాలని ఒక ప్రకటన చేశారు. ఆంధ్రప్రదేశ్ ఏర్పడిన తర్వాత ఆయన ఆంధ్రప్రదేశ్ పౌరుడుగానే హైదరాబాదులో నివాసమేర్పరుచుకొన్నారు. 1957 నుండి ఆయన ఉస్మానియా సెనేట్‌లో శాశ్వత సభ్యులుగా కొంతకాలం ఉన్నారు. వినోభాజీ ప్రారంభించిన భూదాన్ ఉద్యమాలకు ఆయన చేయూతనిచ్చారు. స్వామీజీ 1972 జనవరి 22వ తేదీన హైదరాబాదులో నిర్యాణం చెందారు. జీవితమంతా దేశసేవకే వినియోగించిన అకళంక దేశ భక్తుడు. ●

*Lovely Stay at Holy Tirupathi* *The Gateway of Lord Balaji*

**HOTEL MAYURA**

204, 209, T.P. Area, Tirupati - 517 501 (A.P.)
(Opposite Bus Station)
Phone : 0877-2225925, 2225251, Fax : 0877-2225911
e-mail : mayurahotels@yahoo.co.in, Grams :

# శివసాయుజ్యం చెందిన పుష్పగిరి పీఠాధిపతులు

## - శ్రీశ్రీశ్రీ విద్యాశంకర నృసింహ భారతీస్వాములవారు! -

రెండే రెండు మాసాలు ఉంటే పీఠారోహణ షష్ట్యాబ్ది మహోత్సవం జరిగేది.

రెండు సంవత్సరాలుంటే అష్టదశాబ్ది మహోత్సవం జరిగేది.

ఈ రెండూ జరిగి ఉంటే ఇటు ప్రముఖాంధ్రా, నేనూ ఎంతో సంతోషించేవారము.

వారు పుష్పగిరి పీఠాధీశులైన మొదటి సంవత్సరమే మద్రాసు వచ్చి, ఓ గొప్ప యాగాన్ని మద్రాసు షావుకారుపేటలో చేసారు. ఆర్యవైశ్యప్రముఖులు ఈ యాగాన్ని మహావైభవంగా జరిపించారు.

ఘంటసాల వేంకటేశ్వరరావు, వై.ఎస్.శాస్త్రి, కళాపోషకుడు పి.బి.సుబ్బారావు, భక్తశిఖామణి ఆర్.ఆర్. నాథం ప్రభృతులు యాగనిర్వాహణా కార్యవర్గంలో ప్రధానులు. వారందరూ ఆ యాగానికి నన్ను కూడా పిలిపించారు.

నేను శ్రీ స్వామి వారిని కలుసుకున్న వేళా విశేషమేగాని, స్వామి వారు నన్ను ప్రథమ శ్రేయోగామిగా (ఆత్మబంధువుగా పీఠాధిపతుల్ని చెప్పరాదు) సంభవించారు. అప్పట్నుంచీ వారు మద్రాసు వచ్చినప్పుడల్లా - మా యింట్లోనే దిగేవారు.

పూర్వాశ్రమంలోని వారి సోదరులు కూడా మమ్మ బంధుజనులుగా భావించి, మా ఇంట్లోనే దిగేవారు. మా యింటిని వారందరూ పుట్టింటిగా భావిస్తూ, రాకపోకలు సాగిస్తూ, ఇక్కడే ఉంటూ వచ్చారు. వారివద్ద ఉండే ప్రధాన శిష్యుడు కన్నయ్య తమిళుడు. ఆ కారణంగా పుష్పగిరాధిపతులు యెక్కువగా దక్షిణాది (తమిళనాడు) పర్యటించేవారు.

హైదరాబాదు బేగంపేటలో పీఠకేంద్రం నెలకొన్నప్పట్నుంచీ - ఆంధ్రదేశంలో పర్యటిస్తూ వచ్చారు. పుష్పగిరి పీఠాన్ని అభివృద్ధిపరిచారు. తిరుమల, శ్రీకాళహస్తి క్షేత్రాల్లో వసతి సత్రములు నెలకొల్పారు. హైదరాబాదులో శ్రవణా నక్షత్రం రోజున వేంకటేశ్వర కల్యాణం నిర్వహింపచేస్తున్నారు.



శ్రీశ్రీశ్రీ విద్యా నృసింహ భారతీస్వామి వారు

కడప జిల్లా పెండ్లిమర్రి మండలం కొత్తూరు అగ్రహారం గ్రామానికి చెందిన నృసింహ భారతి 1941లో జన్మించారు. తన 16 యేట సన్యాసం స్వీకరించారు. 1957 ఫిబ్రవరి 4న పీఠాధిపతిగా బాధ్యతలు చేపట్టారు. పీఠం ద్వారా ఆధ్యాత్మిక, సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఉచిత వైద్యశిబిరాలు, పర్యావరణ పరిరక్షణపై అవగాహన కార్యక్రమాలను చేపట్టారు. దక్షిణాది రాష్ట్రాల్లో వేద పాఠశాలలను ఏర్పాటుచేశారు. ఇటీవల గణపతి నవరాత్రోత్సవాలకు ముందు వినాయకుని మట్టి ప్రతిమలనే పూజించాలని, ప్రకృతిని కాపాడుకోవాలని నగరవ్యాప్తంగా పుష్పగిరి పీఠం ద్వారా ప్రచారం చేశారు.

విద్యా నృసింహభారతి పార్థివదేహాన్ని 28 సోమవారం ఉదయం 11 గంటల తరవాత కడప జిల్లాలోని పెన్నానది తీరాన్నున్న పుష్పగిరి మూలస్థానానికి తరలించి మంగళవారం దైవసమాధి కార్యక్రమాన్ని ఏర్పాట్లు చేసారు.

శివసాయుజ్యం (27 సెప్టెంబర్, ఆదివారం) నాటికి 78 సంవత్సరాల వయసు ఉంటుంది. జగద్గురు శ్రీశ్రీ విద్యాశంకర నృసింహస్వామి పీఠాధిపత్యం వహించిన పిమ్మటే పుష్పగిరి పీఠం వృద్ధి చెందింది. ప్రజలకు దగ్గరగా ఉంటూ, ఎంతోమంది పీడిత జనులకు సహాయపడ్డారు. చైనా యుద్ధం సంభవించిన సందర్భములో అప్పటి ప్రధాని 'లాల్‌బహదూర్ శాస్త్రి' ప్రవేశపెట్టిన ఆభరణాలకు ఆయుధాలను 'గోల్డు బాండ్స్' అను పథకానికి బంగారు నగలనిచ్చిన పీఠాధిపతి ఆయనే!

(స్వామి వారిపై వ్యాసం నవంబర్ సంచికలో)



నా కోడలు లలిత ఎత్తుకున్న మనుమరాల్ని ఆశీర్వదిస్తున్న స్వామి వారు




*Compliments from*

**Sri Krishna Bhat**

*When you come to Holy Pilgrimage Centre Tirupati & Tirumala*

**WOOD SIDE ANNEXE**

Opp. to Govindarajulu Temple, 20. E.car Street, Tirupathi.

**WOODSIDE**

Ring Road, Tirumala. Ph : 517504

**HOTEL WOODSIDE**

E.Car Street, Tirupathi. Ph : 2284464

# మాతృభాష మధురమైన భాష

## - రాజులూ! రారాజులూ! మాతృభాషలో గ్రంథాలు రావాలని భావించారు! -

రాజరాజ నరేంద్రుడు రాజమహేంద్రవరమును రాజధానిగా చేసుకుని పాలించిన తెలుగు మహారాజు. మాతృభాష తెలుగు పట్ల అపారమైన ఆసక్తి, భక్తి కలవాడు.

రాజులు భాషను పోషించడమనేది సహజమే! రాజరాజ నరేంద్రునికి తన పూర్వవంశ రాజులు చరితమైన 'మహా భారతము'ను మాతృభాషలో చదవాలనెడి కోరిక కలిగింది.

గ్రంథ పఠనంపై అనురక్తీ, మాతృభాషలో చదవాలనెడి ఆసక్తీ పాలకులకే ఎక్కువగా ఉండేది. సంస్కృత భాషలో అపార పాండిత్యం గల కవివరేణ్యుడు నన్నయ్య మహాకవిని రాజరాజ నరేంద్రుడు పిలిపించాడు. వ్యాస మహాభారతాన్ని తెనిగించమన్నాడు. జాతి ఔన్నత్యం ఆ జాతి భాష ద్వారా ప్రకటితమవుతుంది. సంస్కృతినుద్దీపింపచేస్తూ, చెప్పించిన ఆనాటి భాషా, సంస్కృతీ, ఇతిహాస, జీవనములు తరువాతి తరముల వారికి విదితమవుతాయ్. భాష ప్రౌఢిమ తెలుస్తూంది. రచనా శిల్పం తెలుస్తుంది. ఆనాటి సామాజిక జీవనం తెలుస్తుంది. ఆనాటి కట్టుబాట్లు తెలుస్తాయ్.

రాజరాజ నరేంద్రుని దృష్టిలో తన వంశీయుల పూర్వ చరిత్రను తాను తెలుసుకుంటూ, ఆనాటి నైతిక విలువలు, ధార్మిక జీవితం, వైదిక (వేద) మతానుష్ఠ ధర్మాలను, ఏవిధంగా సమాజం అనుసరిస్తూ పాటించారన్నదీ ఇతిహాసపూర్వకంగా చెప్పించాలని భావించారు. అప్పుడే సభ్య సమాజం సత్యానుష్ఠపరులయ్యే అవకాశం ఉంటుందనీ - తన పూర్వరాజుల ఔన్నత్యాన్ని జీవనాన్నెరుక చేయడమవుతుందనీ భావించాడు.

అప్పటివరకూ పంచమవేదంగానూ, 'జయం'గానూ గల 'మహాభారతము' సంస్కృత భాషలోనే ఉన్నది. సంస్కృతాంధ్ర భాషలపై సమానాధికారం, సమాసక్తి కల కవిపుంగవుడే - భారతాంధ్రీకరణకు అర్హుడనీ భావించాడు - నన్నయ్య భట్టారకుడు, ఉభయ భాషా కవివర్యునికే ఆ బాధ్యతను వొప్పగించారు. రాజు తనకప్పగించిన వ్యాసభారతాన్ని నన్నయ్యగారు వేదంగా భావించారు. నైతిక ధర్మసూత్రాలను చొప్పించి వ్రాయడానికి సరియైన గ్రంథమని, సంతోషిస్తూ, తొలుత ఒక పద్యాన్ని చెప్పారు.


**సారమలిం గవీంద్రులు ప్రసన్నా కథాకలి**
**తార్థయుక్తిలో**
**నారసమేలు ననితరులక్షణ రమ్యత నాద**
**రింపనా**
**నారు చిరార్థ సూక్తినిధి నన్నయభట్టు**
**తెనుంగునన్ మహా**
**భారత సంహితా రచనా బంధురదయ్యే**
**జగద్ధితంబుగన్**

- ఆయన తన కవితా లక్షణాలను వివరిస్తూ, భారతాంధ్రీకరణ లక్ష్యాన్ని తెలియచేసారు. తాను జగత్తు యొక్క హితాన్ని కాంక్షించి, అనువాదానికి నడుము కట్టామన్నారు. జగత్తు మేలు కోరే సమాజంలోని విలువలను, ధర్మగుణ చింతనను ప్రోది చేసి, పొంతనగా పొందుపరచడం తన వాంఛింతమని చెప్పారు.

రాజు యొక్క అభిప్రాయం, తనభిప్రాయమైన ధర్మచింతన-మన్నారు. భారతీయ సనాతననత్వాన్ని త్రికరణశుద్ధిగా విశ్వసించిన నన్నయ్యగారు అక్షర అక్షరమునకూ అనువాదంగా గాకుండా - అలనాటి ప్రజలల్లోని కొన్ని అద్భుత సన్నివేశాలకు ఉపమానంగా, కథా ఉదంతాలను ఉటకరించడంలో ఉభయ భాషా శిల్పాలను చక్కగా, సందర్భోచితంగా ఉదహరించారు.





ఓం
మొరిషస్ తెలుగు మాహా సభ
*Mauritius Telugu Maha Sabha*

**Shri Pramukhandhra**
**16(64), Thambiah Reddy Street**
**West Mambalam**
**Chennai-600 033**
**India**

3rd September, 2015

Dear Sir/Madam,

***List of MTMS New Office Bearers***

Following the election of Executive members of the Mauritius Telugu Maha Sabha held on 25th July, 2015, we wish to inform you that a new Managing Committee has been constituted under the Chairmanship Shri Anbend Veerasawmy.

Please be advised that the Mauritius Andhra Maha Sabha has changed its name and is now known as **MAURITIUS TELUGU MAHA SABHA**.

It will be appreciated if you can amend your relevant records accordingly.

Thanking you for your attention.

వారు పాలనా సంఘ సభ్యుల వివరాలను పంపలేదు. మొరిషస్ తెలుగు మహాసభ గ్రహించి పంపండి.

**శ్రీ.వి. రావ్ పేజీ**
**(గోటేటి వేంకటేశ్వరరావు)**

# సిద్ధపురుషుని శరీరం స్వాభావికంగా మంచినే చేస్తుంది



\- స్వామి వివేకానంద

గడచిన నెల ఎంతో సంతోషంగా వున్నాను. ఈ నెల కొంత నీరుగారి పోయాను. తమ్ముడి కూతురి నృత్యరంగ ప్రవేశం. నాన్నగారి సహస్రపూర్ణ చంద్ర దర్శనం అలా రెండు నెలలు బిజీబిజీగా సంతోషంగా వున్న నాకు ఈ సెప్టెంబరు నెల రెండు సంస్థలు ఎన్నికల చిరాకుతోపాటు ఇద్దరు గొప్ప వ్యక్తుల మరణం నన్ను చాలా బాధించింది. పుష్పగిరి మఠం శంకరాచార్యులు శ్రీ విద్యానృసింహ భారతిస్వామివారి శివైక్యం వార్తను చదివి మా ఇంటిల్లిపాది దుఃఖంలో మునిగిపోయాము. ఆయన మాకు అత్యంత ఆప్తులు. నాన్నగారన్నా, మా కుటుంబమన్నా ఆయనకు ఎనలేని ప్రేమాభిమానం. చెన్నై వస్తే మా ఇంటిలోనే వారికి ఆతిథ్యం కల్పించే సదవకాశాన్ని ఇచ్చేవారు. సుమారుగా ఒక పదిమార్లు చంద్రమౌళీశ్వర పీఠాన్ని మా ఇంటిలో వుంచి పూజలు జరిపించే భాగ్యం కల్పించారాయన. స్ఫటికలింగానికి రుద్రాభిషేకం చేసే భాగ్యము కలిగింది. నాకు ఊహ తెలిశాక నేను చూసిన మొట్టమొదటి పీఠాధిపతి వారే. వెంకటేశా అంటూ ఎంతో చనువుగా పిలిచేవారు. చెన్నైకు వస్తే 3 రోజుల నుంచి వారం రోజులు మా ఇంటిలో బస చేసేవారు. ఆ వారం రోజులు వచ్చిపోయే భక్తులతో మా యిల్లు కిటకిటలాడుతూ వుండేది. మాది చిన్న ఇల్లయినా ఆయన అక్కడే వుండాలని ఆయన కోరిక. ఈశ్వరేచ్ఛ. నన్ను స్కూలు విద్యార్థి నుంచి చూచినవారు, ఈ స్థాయివరకు చూచి ఆశీర్వదించి వున్నారు. అమ్మ, నాన్నగారన్నా, నేనన్నా, మా తమ్ములన్నా ప్రత్యేక అభిమానం. ఇంటి పెద్దకొడుకు, కోడలుగా కుటుంబ బాధ్యతలు స్వీకరించే మా పట్ల ఆయనకు ప్రత్యేకమైన ప్రేమ వుండేది. అలాగే నేను హైదరాబాద్ శంకరమఠానికి వెళ్లినప్పుడు అదే ప్రేమాభిమానం వుండేది. ప్రత్యేకంగా చూసేవారు. అది పూర్వజన్మ సుకృతం. అంత పెద్ద పీఠాధిపతి మా ఇంటి పెద్ద దిక్కుగా, మంచి చెడ్డలు అన్నీ చంద్రమౌళీ రుడు చూసుకుంటాడని ధైర్యం చెప్పేవారు. మా మరదలు మరణమప్పుడు, మా అమ్మ మరణమప్పుడు తాను ఒక పీఠాధిపతియైనా, గొప్ప మానవతావాదిగా ఫోనుచేసి పరామర్శించి నాలుగు ధైర్యవాక్యాలు చెప్పారు.





పుష్పగిరి పీఠాధీశులు మా యింటికి వచ్చినప్పుడు మా నాన్నగారూ, నేనూ, మా పిల్లలూ స్వాగతం పలుకుతున్న సందర్భం.

నాన్నగారి బాగోగులు మంచి చెడులు తెలుసుకుంటూ వుండేవారు. ఆయన శివైక్యం చెందారన్న వార్త జీర్ణించుకోడానికి చాల కష్టమైంది. పుష్పగిరి శంకర పీఠాన్ని అన్ని విధాల సామాజిక కార్యక్రమాలు చేపట్టే విధంగా తీర్చిదిద్దారు. తిరుపతిలో, శ్రీకాళహస్తిలో పుష్పగిరి మఠం శాఖలు, శంకరనేత్ర చికిత్సాలయం, ఇలా ఎన్నో, ఎన్నెన్నో, ఆయన ఆధ్వర్యంలోనే ఆచార్య సభలు జరిగేవి, పెజావర్ మఠం స్వామి, స్వామి దయానంద సరస్వతి (ఆయనా ఈ నెల శివైక్యం చెందారు) పుష్పగిరి స్వామి కలిసి ఎన్నో కార్యక్రమాలు నిర్వహించారు. నాన్నగారు, అమ్మ కలిసి స్వామివారితో దక్షిణ భారతదేశ పుణ్యస్థలాలకు కూడా వెళ్లారు. అంతటి అనుబంధం ఆయనతో మాది. ఈ మధ్య ఆరోగ్యం రీత్యా, వయసు రీత్యా వారు చెన్నై రావడం లేదు. కానీ మేము హైదరాబాదు వెళ్లినప్పుడల్లా ఆశ్రమానికి వెళ్ళి ఆయన్నూ, చంద్రమౌళీశ్వరస్వామిని దర్శనం చేసుకునేవాళ్లం. అలాంటి పీఠాధీశులు నూటికి కోటికి ఒకరుంటారు. మానవతావాదియైన పీఠాధిపతి.

## శ్రీ బాలశౌరిరెడ్డిగారు



15-9-2015 మంగళవారం ఉదయం సుమారు 11 గంటలప్పుడు, "జీవి నాన్నగారు లేరంటూ నా స్నేహితుడు వెంకట రమణా రెడ్డి ఫోన్ చేశాడు. బాలశౌరిరెడ్డిగారి కుమారుడు నా స్నేహితుడే కాని వాడితో కన్నా ఆయనతో నాకెక్కువ పరిచయం ఉండేది. ఏ సభలో కనిపించినా ఆప్యాయంగా పలకరించేవారు. హిందీ భాషా ప్రేమికుడు. 88 ఏళ్ళ బాలశౌరిరెడ్డిగారు జాతీయ భాష హిందీకి ఎనలేని సేవలు చేసి, కేంద్రసాహిత్య పురస్కారాలనెన్నిటినో అందుకుని, ప్రధాని సలహాదారునిగా జీవిత ప్రస్థానాన్ని సంపూర్ణం చేసుకున్న ధన్యజీవి. ఆయన హిందీభాషలో 72 పుస్తకాలు, తెలుగు నుంచి హిందీకి 24 పుస్తకాలను అనువాదం చేశారు. ఆయన 18 పిహెచ్‌డీలు, 11 ఎంఫిల్ డిగ్రీలు పొందారు. 2006లో సాహిత్య అకాడమీ పురస్కారం అందుకున్నారు. భారతదేశంలో ఎక్కడ సెమినార్ జరిగినా, అందు పాల్గొనేవారు. అంతగొప్ప మనిషి నన్ను ఆయనతో సమానంగా కూర్చోపెట్టుకుని ఎన్నో విషయాలు మాట్లాడేవారు. ఆయన మరణానికి నాలుగు రోజులు ముందు నాకు ఫోన్ చేసి ఒకసారి ఇంటికి రమ్మని మనిద్దరం భోజనం చేసి కొన్ని విషయాలు మాట్లాడుకోవాలని తెలిపారు. నేను రెండురోజులలో వస్తానని చెప్పాను. అయితే నేను భోపాల్ వెడుతున్నా వచ్చాక ఫోన్ చేస్తా రమ్మన్నారు. కాని ఆయన భోపాల్ నుండి రావడం ఇటువంటి వార్త వినవలసి వస్తుందని, నేను ఊహించలేదు. 88 ఏళ్ల వయసులో చెన్నైలో ఏ సాహిత్య సభ జరిగినా అందులో ఆయన పాల్గొనేవారు. తెలుగువారై వుండి జాతీయ భాషకు సుదీర్ఘకాలం సేవచేసిన మహనీయుడు. ఎన్నో పురస్కారాలు అందుకున్నా నిగర్విగా, కల్మషంలేని వ్యక్తిగా, అందరికీ ఆత్మీయుడిగా వుండేవారు. అలాంటి మంచి మనిషి ఇక లేరు అనే వార్త చాలా బాధాకరం.